



DD9 వార్త
తెలుగు దినపత్రిక

## బన్నీ 'రాకా' పెద్ద స్కెచ్చే.. కానీ 'శక్తి' పోట్లు?



06

సంపుటి : 02 సంచిక : 230 హైదరాబాద్, ఏప్రిల్, శుక్రవారం 10, 2026 పేజీలు : 06 వెల : 3.00

# నారీశక్తికి మరింత బలం

- మహిళా రిజర్వేషన్లపై మోడీ కీలక సందేశం
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశానికి సిద్ధం
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుపై దృష్టి
- రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెంపు లక్ష్యం
- సమానత్వానికి కీలక అడుగు అని ప్రధాని వ్యాఖ్య
- అన్ని పార్టీల సహకారం కోరిన కేంద్రం
- మహిళల ప్రగతి దేశాభివృద్ధికి పునాది
- 2029 ఎన్నికల నుంచి అమలు లక్ష్యం
- పండుగల మధ్య చారిత్రక నిర్ణయం దిశగా అడుగులు

నేషనల్ బ్యూరో, (డిడి9 వార్త):



దేశంలో మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో ..మిగతా 2లో

# సీట్లు పెంచకుండా రిజర్వేషన్లు ఇవ్వండి

- మహిళా రిజర్వేషన్లపై సీఎం స్టాలిన్ కీలక వ్యాఖ్యలు
- డీలిమిటేషన్‌పై స్టాలిన్ తీవ్ర విమర్శలు
- దక్షిణాదికి అన్యాయం జరుగుతుందని ఆరోపణ
- లోక్‌సభ సీట్ల పెంపుపై తమిళనాడు అభ్యంతరం
- "ఇది సంస్కరణ కాదు... అధికార పునర్విభజన"
- మహిళా రిజర్వేషన్ అమలుపై షరతులు
- ఉత్తరాది రాష్ట్రాలకు లాభం జరుగుతుందన్న ఆరోపణ
- దక్షిణాది వాటా తగ్గిపోతుందన్న ఆందోళన
- జనాభా నియంత్రణలో విజయానికి శిక్ష
- ఎన్నికల రాజకీయాల కోణంలో బిల్లుపై విమర్శలు

నేషనల్ బ్యూరో, (డిడి9 వార్త):

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశం దేశ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా లోక్‌సభ సీట్ల సంఖ్య పెంపు ప్రతిపాదనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర అభ్యంతరం ..మిగతా 2లో



# గులాబీ గూటికి జీవన్ రెడ్డి

## తెలంగాణ రాజకీయాల్లో మరో సంచలన మార్పు



### సీనియర్ కాంగ్రెస్ నేత టి. జీవన్ రెడ్డి కీలక నిర్ణయం

- బీఆర్ఎస్ పార్టీలో అధికారిక చేరిక
- దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీకి సేవలు
- మాజీ మంత్రి గా కీలక బాధ్యతలు
- జగిత్యాలలో బలమైన రాజకీయ పునాది
- కేటీఆర్ స్వయంగా నివాసానికి వెళ్లి ఆహ్వానం
- గులాబీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతం
- కేసీఆర్–జీవన్ రెడ్డి మధ్య 40 ఏళ్ల స్నేహం
- అప్పట్లో కాంగ్రెస్ పట్ల నిబద్ధతతో నిరాకరణ
- భవిష్యత్ రాజకీయ సమీకరణలపై ప్రభావం

హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ రాజకీయాల్లో మరో భారీ కుదుపు చోటుచేసుకుంది. దశాబ్దాల కాలం పాటు కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకలా నిలిచిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానానికి కొత్త మలుపునిస్తూ అధికారికంగా భారత్ రాష్ట్ర సమితిలో చేరారు. జగిత్యాలలోని జీవన్ రెడ్డి నివాసానికి స్వయంగా విచ్చేసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ, కేసీఆర్, జీవన్ రెడ్డిల మధ్య ఉన్న నాలుగు దశాబ్దాల స్నేహబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 2014లోనే జీవన్ రెడ్డిని కేసీఆర్ పార్టీలోకి ఆహ్వానించినప్పటికీ, అప్పట్లో ఆయన కాంగ్రెస్ పట్ల తనకున్న నిబద్ధతను చాటుతూ ఆ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించారని, కానీ నేటి పరిస్థితులు ఆయనను ఈ నిర్ణయం తీసుకునేలా చేశాయని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అహంకారంతో ..మిగతా 2లో

# అంతర్జాతీయ స్థాయి విద్య వైపు తెలంగాణ

## 100 యంగ్ ఇండియా స్కూళ్లకు శ్రీకారం

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- ప్రతి జిల్లాలో ఆధునిక విద్యాసంస్థల ఏర్పాటు
- విద్యతోనే భవిష్యత్తు బలోపేతం చేస్తాం
- భారీ పెట్టుబడులతో రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం
- ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్
- ఉచిత రవాణా, పోషకాహారంతో విద్యార్థులకు సౌకర్యాలు
- గ్రామీణ విద్యార్థులకు ప్రత్యేక ప్రాధాన్యత
- ప్రైవేట్ స్కూళ్లకు మించిన సదుపాయాలు లక్ష్యం
- సమానత్వ భావనతో ఒకే వేదికపై విద్య



హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణలో విద్యా రంగాన్ని పూర్తిగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ ప్రమాణాల విద్య అందించాలన్న లక్ష్యంతో భారీ ప్రణాళికలు అమలు చేస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 100 యంగ్ ఇండియా ..మిగతా 2లో

# కమలదళంలో నిధుల సెగ..?

- తెలంగాణ బీజేపీలో గోల్‌మాల్ గుసగుసలు..!
- తెలంగాణ బీజేపీలో నిధుల గోల్‌మాల్ ఆరోపణలు
- మున్సిపల్ ఎన్నికల ఫండ్స్‌పై హైకమాండ్ సీరియస్
- జిల్లా వారీగా విచారణకు ప్రత్యేక బృందాలు
- నివేదికల తర్వాత పార్టీ లో కీలక మార్పుల సూచనలు

హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ బీజేపీలో నిధుల గోల్‌మాల్ గుసగుసలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ హైకమాండ్ భారీగా నిధులను పంపినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రాకపోవడమే కాకుండా, నిధుల వినియోగంలో పారదర్శకత ..మిగతా 3లో



# పొంగులేటి.. పొగరు తగ్గించుకో, నీ చిట్టా నా దగ్గర ఉంది..

- మైనింగ్ అక్రమాలపై హరీష్ రావు ఫైర్
- రాఘవ కన్స్ట్రక్షన్స్ వ్యవహారంపై ఆధారాల వెల్లడి
- పొంగులేటిపై ఘాటు విమర్శలు... 'పొగరులేటి' వ్యాఖ్యలు
- నాదర్‌గుల్ భూముల అంశంపై మరోసారి ఆరోపణలు

హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ రాజకీయాల్లో మైనింగ్ అక్రమాల వ్యవహారం అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన 'రాఘవ కన్స్ట్రక్షన్స్' మైనింగ్ లూటీపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పొంగులేటి తన 'పొగరు' తగ్గించుకోవాలని హితవు పలికిన హరీష్ రావు, అక్రమ మైనింగ్‌కు ..మిగతా 3లో



# బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే

- టీపీసీసీ చీఫ్ సంచలన ఆరోపణలు
- రెండు పార్టీలు కలిసిపోతాయన్న వ్యాఖ్యలు
- బీజేపీతో ఉంటే లాభం లేదని వెల్లడి
- మాజీ మంత్రి జీవన్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు
- ముఖ్యమంత్రిపై విమర్శలు చేయొద్దని హితవు
- పొంగులేటిపై ఆరోపణలు నిరాధారమని కొట్టివేత
- హరీష్ రావుకు బహిరంగ సవాల్
- నాదర్గుల్ భూముల వివాదంపై విమర్శలు
- కాళేశ్వరం ప్రాజెక్టుపై మరోసారి ప్రస్తావన

హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి విమర్శలు, ప్రత్యారోపణలు ముదురుతున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన భారత రాష్ట్రీయ సమితి మరియు భారతీయ జనతా పార్టీ వేర్వేరు ..మిగతా 2లో



# హెచ్ఐవీ బాధితులకు గౌరవం ఇవ్వాలి



03

- అవగాహనతోనే వ్యాధిపై గెలుపు సాధించొచ్చు
- మంత్రి దామోదర రాజనరసింహా సూచన
- హైదరాబాద్‌లో అవగాహన కార్యక్రమానికి హాజరు
- సమాజంలో అపోహలు తొలగించాలని పిలుపు
- హెచ్ఐవీ వ్యాప్తి మార్గాలపై స్పష్టత
- సాధారణ పరిచయాలతో వ్యాపించదని హితవు
- ఉచిత పరీక్షలు, చికిత్సపై ప్రభుత్వం దృష్టి
- వివక్ష చట్టరీత్యా నేరమని హెచ్చరిక
- యువతకు ఆరోగ్యంపై కీలక సూచనలు
- ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణమే లక్ష్యం

# నారీశక్తికి మరింత బలం

మొదటిపేజీ తరువాయి



ప్రధాని నరేంద్ర మోడీ తన అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేసిన తాజా బ్లాగ్‌లో మహిళా రిజర్వేషన్ చట్టంపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించే "నారీశక్తి వందన్ అధినియం" అమలును త్వరితగతిన చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఈ చట్టం అమలు కోసం ఏప్రిల్ 16 నుంచి ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశం దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఒక ముఖ్య ఘట్టంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రధాని పేర్కొన్న వివరాల ప్రకారం, ఈ సమావేశంలో మహిళా రిజర్వేషన్ అమలుకు సంబంధించిన శాసనపరమైన ప్రక్రియలను పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. లోక్‌సభతో పాటు రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వడం ద్వారా సమానత్వానికి మరింత బలం చేకూరుతుందని భావిస్తున్నారు. భారతదేశంలో మహిళలు జనాభాలో సగం ఉన్నప్పటికీ, రాజకీయాల్లో వారి ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం ఒక పెద్ద లోటుగా ప్రధాని పేర్కొన్నారు. ఈ అసమానతను తొలగించడం అవసరమని ఆయన అన్నారు.మహిళలు ప్రతి రంగంలోనూ అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారని ప్రధాని ప్రశంసించారు. విజ్ఞాన సాంకేతిక రంగం నుంచి క్రీడలు, కళలు, వ్యాపారాలు, సాయుధ దళాల వరకు మహిళలు తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని గుర్తుచేశారు. గత కొన్ని దశాబ్దాల్లో మహిళలకు విద్య, ఆరోగ్యం, ఆర్థిక అవకాశాలు విస్తరించాయని తెలిపారు. ఈ మార్పుల వల్ల మహిళల సామాజిక, ఆర్థిక భాగస్వామ్యం పెరిగిందని చెప్పారు. అయితే రాజకీయాల్లో మాత్రం అదే స్థాయిలో ఎదుగుదల కనిపించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళలు పాలనలో భాగమైతే నిర్ణయాల్లో కొత్త దృక్కోణాలు వస్తాయని ప్రధాని అభిప్రాయపడ్డారు. వారి అనుభవాలు, ఆలోచనలు పాలనలో నాణ్యతను పెంచుతాయని చెప్పారు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మహిళల భాగస్వామ్యం పెరిగితే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అందుకే ఈ చట్టం అమలు ఆలస్యం చేయకూడదని స్పష్టం చేశారు.ఈ బిల్లును అమలు చేయడానికి రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, వ్యక్తులు అన్న తేడా లేకుండా అందరూ కలిసిరావాలని ప్రధాని పిలుపునిచ్చారు. ఇది కేవలం ఒక చట్టం మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయమని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలంటే మహిళలకు సమాన అవకాశాలు ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు. సమసమానత్వ భావనను ఆచరణలో చూపించడానికి ఇది మంచి అవకాశం అని తెలిపారు.

2029లో జరగనున్న లోక్‌సభ మరియు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నుంచి ఈ రిజర్వేషన్ అమల్లోకి రావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రక్రియను వాయిదా వేయడం అంటే అసమానతను కొనసాగించడమే అవుతుందని ప్రధాని హెచ్చరించారు. దేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ సమయంలో మహిళలకు కూడా సమాన అవకాశాలు కల్పించడం అత్యవసరమని అన్నారు.మహిళా రిజర్వేషన్ బిల్లుపై గతంలో కూడా అనేక ప్రయత్నాలు జరిగాయని ప్రధాని గుర్తుచేశారు. వివిధ ప్రభుత్వాలు కమిటీలు ఏర్పాటు చేశాయని, బిల్లులు ప్రవేశపెట్టాయని తెలిపారు. కానీ అవి పార్లమెంట్ ఆమోదం పొందలేదని చెప్పారు. అయినప్పటికీ అన్ని పార్టీల్లో ఈ అంశంపై ఒకే అభిప్రాయం కొనసాగిందని పేర్కొన్నారు. 2023లో ఈ చట్టం ఆమోదం పొందడం ఒక చారిత్రక ఘట్టమని ఆయన పేర్కొన్నారు.

ఇదిలా ఉంటే, ఈ ప్రత్యేక పార్లమెంట్ సమావేశం పండుగల సీజన్ మధ్య జరగడం కూడా ప్రత్యేకతగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో జరిగే పండుగల సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రధాని తన బ్లాగ్‌ను ముగించారు. ఈ సమావేశం ద్వారా దేశ మహిళలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకోబోతున్నామని తెలిపారు.మహిళా రిజర్వేషన్ చట్టం అమలు భారత ప్రజాస్వామ్యంలో ఒక కీలక మలుపుగా భావిస్తున్నారు. సమానత్వం, న్యాయం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతున్న దేశానికి ఇది ఒక పెద్ద అడుగుగా నిలుస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మహిళల పాత్రను మరింత బలోపేతం చేయడం ద్వారా దేశ భవిష్యత్తును మరింత దృఢంగా నిర్మించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# గులాబీ గూటికి జీవన్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

వ్యవహరిస్తూ జీవన్ రెడ్డి వంటి సీనియర్లను అవమానపరుస్తోందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు.

రుణమాఫీ పేరుతో రైతులను వంచించారని, అహంకారపూరిత వ్యాఖ్యలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని విమర్శించిన కేటీఆర్, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా జీవన్ రెడ్డి వంటి అనుభవం ఉన్న నాయకుల సహకారం పార్టీకి ఎంతో అవసరమని పేర్కొన్నారు. అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ తన మనసులోని ఆవేదనను పంచుకున్నారు. తాను ఎన్టీఆర్, చెన్నారెడ్డి, వైఎస్సార్ వంటి దిగ్గజ ముఖ్యమంత్రుల పాలనను చూశానని, అయితే వారందరికంటే కేసీఆర్ పాలనే అత్యంత మెరుగ్గా సాగిందని కొనియాడారు. పదేళ్ల కేసీఆర్ ప్రగతిశీల పాలన తర్వాత, రేవంత్ రెడ్డి హయాంలో రాష్ట్రం రెండేళ్లలోనే తిరోగమనంలోకి వెళ్లిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రాజకీయ విమర్శలే కాకుండా, వ్యక్తిగత మానసిక క్షోభ , రాష్ట్ర ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన తర్వాతే తాను ఈ నిర్ణయం తీసుకున్నానని స్పష్టం చేశారు.

తన రాజకీయ ప్రస్థానం చివరి దశలో ఉందని, బహుశా మరో ఎన్నికను చూసే అవకాశం తనకు ఉండవచ్చని చెబుతూ, ఈ చివరి అంకంలో పాత మిత్రుడైన కేసీఆర్ జ్ఞాపకాలను నెమరేసుకుంటూ ఆయనతో కలిసి నడవాలని నిర్ణయించుకున్నట్లు జీవన్ రెడ్డి వెల్లడించారు. ప్రభుత్వం రుణమాఫీలో విఫలమైందని, రైతుల ఆక్రోశం రాష్ట్రవ్యాప్తంగా మిన్నంటుతోందని ఆయన విమర్శించారు. పౌర సమాజంలో గౌరవం ఉన్న నాయకులను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, ముఖ్యంగా రేవంత్ రెడ్డి తీరు వల్ల సీనియర్లకు గౌరవం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

వచ్చే రెండు మూడు రోజుల్లో హైదరాబాద్ వెళ్లి కేసీఆర్‌తో భేటీ కానున్నట్లు జీవన్ రెడ్డి తెలిపారు. పార్టీలో ఆయనకు సముచిత స్థానం , తగిన



గౌరవం కల్పిస్తామని కేటీఆర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. దశాబ్దాల పాటు కాంగ్రెస్ జెండా మోసిన జీవన్ రెడ్డి వంటి మేధావి, నిబద్ధత గల నాయకుడు బీఆర్ఎస్ గూటికి చేరడం కరీంనగర్ జిల్లాలోనే కాకుండా, రాష్ట్ర రాజకీయాల్లోనే ఒక కీలక మలుపుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చేరికతో కాంగ్రెస్ కోటలో ఒక పెద్ద వికెట్ పడినట్లయిందని, రాబోయే రోజుల్లో ఇది మరిన్ని రాజకీయ సమీకరణాలకు దారితీస్తుందని స్పష్టమవుతోంది.

# సీట్లు పెంచకుండా రిజర్వేషన్లు ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి

వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను సాధారణ పరిపాలనా సంస్కరణగా కాకుండా, అధికారాన్ని ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మళ్లించే రాజకీయ చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ నేపథ్యంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే నారీ శక్తి వందన్ అమలుపై కూడా ఆయన స్పందించారు.

స్టాలిన్ అభిప్రాయం ప్రకారం, 2011 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ చేపడితే దేశంలోని ఉత్తర భారత రాష్ట్రాలకు పెద్దఎత్తున లాభం కలిగే అవకాశం ఉంది. జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్లు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఆయన చెప్పారు. దీంతో ఆ రాష్ట్రాల ప్రాతినిధ్యం దాదాపు రెట్టింపు కావచ్చని పేర్కొన్నారు. అదే సమయంలో దక్షిణ భారత రాష్ట్రాల వాటా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 24 శాతానికి పరిమితమయ్యే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.

మహిళా రిజర్వేషన్ విషయంలో తమ పార్టీకి ఎలాంటి అభ్యంతరం లేదని స్టాలిన్ స్పష్టం చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని పూర్తిగా సమర్థిస్తున్నామని తెలిపారు. అయితే, సీట్ల సంఖ్య పెంచకుండా ఈ రిజర్వేషన్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సీట్ల పెంపు వల్ల రాజకీయ సమతుల్యత దెబ్బతింటుందని ఆయన అభిప్రాయపడ్డారు. అందుకే ఈ రెండు అంశాలను వేర్వేరుగా చూడాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలను స్టాలిన్ తీవ్రంగా విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం పార్లమెంటరీ వ్యవస్థను బలహీనపరుస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో పార్లమెంట్ ఒక చురుకైన చర్చా వేదికగా ఉండాలని, కానీ ప్రస్తుతం సభ్యులకు సరైన సమయం కూడా లభించడం లేదని అన్నారు. సీట్ల సంఖ్య పెంపు వల్ల సమస్యలు మరింత పెరుగుతాయని ఆయన వ్యాఖ్యానించారు.

"కనిష్ఠ ప్రభుత్వం - గరిష్ఠ పాలన" అనే నినాదానికి విరుద్ధంగా ఈ చర్యలు ఉన్నాయని స్టాలిన్ పేర్కొన్నారు. సీట్ల పెంపు వల్ల ప్రభుత్వ ఖర్చులు పెరుగుతాయని, పన్ను చెల్లింపుదారులపై అదనపు భారం పడుతుందని అన్నారు. అంతేకాకుండా, పార్లమెంటరీ పనితీరు నాణ్యత కూడా తగ్గే ప్రమాదం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తికి ఇది విరుద్ధమని కూడా వ్యాఖ్యానించారు. డీలిమిటేషన్ ప్రక్రియను స్టాలిన్ మరింత తీవ్రంగా విమర్శిస్తూ, జనాభా నియంత్రణలో విజయం సాధించిన రాష్ట్రాలకు ఇది శిక్షలా మారుతుందని అన్నారు. తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా నియంత్రణలో మంచి ఫలితాలు సాధించాయని గుర్తుచేశారు. అయితే అదే కారణంగా ఇప్పుడు ఈ రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే పరిస్థితి రావడం అన్యాయం అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియ వల్ల ఉత్తరాది రాష్ట్రాలకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని ఆయన ఆరోపించారు.

ఇదే విషయాన్ని ఇతర దక్షిణాది నాయకులు కూడా ప్రస్తావిస్తున్నారని స్టాలిన్ తెలిపారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేశారని చెప్పారు. ఈ ప్రక్రియ సమాఖ్య వ్యవస్థను వక్రీకరించే ప్రమాదం ఉందని వారు హెచ్చరించినట్లు తెలిపారు. ఇక మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావడంపై కూడా స్టాలిన్ సందేహాలు వ్యక్తం చేశారు. పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో ఈ బిల్లును ముందుకు తేవడం వెనుక రాజకీయ ప్రయోజనాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఇది మహిళా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. గతంలో కూడా ఎన్నికల ముందు ఇలాంటి చర్యలు తీసుకున్నట్లు ఆయన గుర్తుచేశారు.



అయితే మహిళా రిజర్వేషన్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్టాలిన్ మరోసారి స్పష్టం చేశారు. కానీ అది సమతుల్యతను దెబ్బతీయకుండా అమలు కావాలని ఆయన అన్నారు. సీట్ల పెంపు లేకుండా, ఇప్పటికే బాధ్యతాయుతంగా వ్యవహరించిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా ఈ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఉద్దేశం నిజాయితీగా ఉంటే ఈ మార్గంలో ముందుకు రావాలని సూచించారు. డీలిమిటేషన్ అంశం దేశ రాజకీయాల్లో కొత్త వివాదానికి దారి తీసింది. ఒకవైపు మహిళా రిజర్వేషన్ అమలు దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటుండగా, మరోవైపు రాష్ట్రాల మధ్య సమతుల్యతపై చర్చలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఉత్తరాది-దక్షిణాది రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య అసమానతలపై చర్చ మరింత ఉత్కంఠగా మారింది. రాబోయే రోజుల్లో ఈ అంశంపై దేశవ్యాప్తంగా రాజకీయ చర్చలు మరింత వేడెక్కే అవకాశం కనిపిస్తోంది.

# బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే

మొదటిపేజీ తరువాయి

కాదని, భవిష్యత్తులో అవి ఒకటిగా మారే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

గాంధీ భవన్‌లో నిర్వహించిన ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆయన, బీజేపీతో కలిసిన వారికి ఎలాంటి లాభం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరినందుకే గతంలో బీఆర్ఎస్‌ను అధికారానికి దూరం చేశారని ఆయన అన్నారు. ప్రజలు తీసుకున్న నిర్ణయం స్పష్టంగా మార్పు వైపు ఉందని గుర్తుచేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నేత జీవన్ రెడ్డి వ్యవహారశైలిపై కూడా మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఎన్నో అవకాశాలు ఇచ్చిందని, అనేకసార్లు పోటీ చేసే అవకాశం కల్పించిందని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితిలో పార్టీపై విమర్శలు చేయడం సరికాదని సూచించారు. మారుతున్న రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన హితవు పలికారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వస్తున్న విమర్శలను కూడా ఆయన ఖండించారు. ఎమ్మెల్యేలందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్న నాయకుడిపై విమర్శలు చేయడం సరైన పని కాదని అన్నారు. గతంలో ఇతర పార్టీలపై చేసిన విమర్శలను గుర్తు చేసుకుని మాట్లాడాలని జీవన్ రెడ్డికి సూచించారు. పార్టీ అంతర్గత విషయాలను బహిరంగంగా ప్రస్తావించడం మంచిది కాదని అన్నారు.ఇక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై వస్తున్న ఆరోపణలను కూడా ఆయన తిరస్కరించారు. ఇవి కేవలం



రాజకీయ ప్రయోజనాల కోసం చేస్తున్న ఆరోపణలేనని స్పష్టం చేశారు. బురదజల్లే రాజకీయాలను మానుకోవాలని సూచించారు. ఎవరికైనా నిజంగా ఆధారాలు ఉంటే వాటిని ప్రజల ముందు ఉంచాలని, లేకపోతే ఇలాంటి ఆరోపణలు చేయకూడదని చెప్పారు.

ఈ సందర్భంగా హరీష్ రావుకు ఆయన బహిరంగ సవాల్ విసిరారు. నిజంగా ఆధారాలు ఉంటే వచ్చి చర్చకు సిద్ధమవ్వాలని, ఆధారాలు లేకుండా చేసే నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. రాజకీయాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.నాదర్గుల్ ప్రాంతంలో జరిగిన భూముల వ్యవహారంపై కూడా మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. ఆ వివాదం గత పాలనలోనే జరిగినదని, ఆ సమయంలో జరిగిన అక్రమాలపై ప్రజలకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన విషయాలను ఇప్పుడు మర్చిపోవడం సాధ్యం కాదని చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై కూడా ఆయన వ్యాఖ్యలు చేశారు. గత పాలనలో నిర్మించిన ఈ ప్రాజెక్టు మూడేళ్లకే సమస్యలు ఎదుర్కొంటోందని విమర్శించారు. అదే సమయంలో కాంగ్రెస్ పాలనలో నిర్మించిన ప్రాజెక్టులు ఇప్పటికీ బలంగా ఉన్నాయని తెలిపారు. ఇది పాలనలో తేడాను చూపుతుందని చెప్పారు.మంత్రివర్గ విస్తరణపై వచ్చిన ప్రశ్నలకు స్పందిస్తూ, అది పూర్తిగా ముఖ్యమంత్రి నిర్ణయాధికార పరిధిలోని అంశమని తెలిపారు. తాము తెలిసిన మేరకు త్వరలో విస్తరణ ఉండే అవకాశాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వంలో సమన్వయం కొనసాగుతోందని చెప్పారు.

చివరగా విద్యార్థి విభాగంపై కూడా ఆయన వ్యాఖ్యానించారు. తాము అందరూ విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి వచ్చామని, వెంకటస్వామి నాయకత్వంలో విద్యార్థి విభాగం మరింత బలపడాలని ఆకాంక్షించారు. యువత రాజకీయాల్లో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహేష్ కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారితీస్తున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విమర్శలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ అంశంపై రాజకీయ వేడి మరింత పెరగనున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు.

# అంతర్జాతీయ స్థాయి విద్య వైపు తెలంగాణ

మొదటిపేజీ తరువాయి



ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. విద్యనే ఆయుధంగా తీసుకుని తెలంగాణ పిల్లలు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా తయారవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి, రాష్ట్రంలో విద్యారంగంలో పెద్ద ఎత్తున మార్పులు తీసుకువస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేసిన సందర్భంగా ఆయన ఈ విషయాలు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు సులభంగా పాఠశాలకు చేరుకునేలా చేయడమే లక్ష్యమని చెప్పారు.

ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు అత్యాధునిక సదుపాయాలతో నిర్మించబడతాయని తెలిపారు. ఒక్కో పాఠశాలకు సుమారు 100 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి స్కూల్‌ను 20 నుంచి 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తామని చెప్పారు. ఇంగ్లీష్ మీడియంలో బోధన, ఆధునిక డిజిటల్ పరికరాలు, విశాలమైన తరగతి గదులు, క్రీడా మైదానాలు వంటి అన్ని సదుపాయాలు ఈ స్కూళ్లలో అందుబాటులో ఉంటాయని వివరించారు.విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది కూడా స్కూల్ క్యాంపస్‌లోనే ఉండేలా నివాస సదుపాయాలు కల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. దీంతో విద్యార్థులకు ఎల్లప్పుడూ పర్యవేక్షణ, మార్గదర్శనం లభిస్తుందని అన్నారు. అన్ని వర్గాల విద్యార్థులు ఒకే చోట చదువుకునే విధంగా ఈ స్కూళ్లను రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. ఇది సమానత్వ భావనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

ఇక యంగ్ ఇండియా స్కూళ్లతో పాటు ప్రతి నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాల్లో ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ పాఠశాలలు సెమీ రెసిడెన్షియల్ విధానంలో కొనసాగుతాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు మంచి విద్య అందించేందుకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.గ్రామీణ కుటుంబాలపై విద్య ఖర్చు భారం తగ్గించడమే ఈ పబ్లిక్ స్కూళ్ల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో భారీ ఫీజులు చెల్లించలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది పెద్ద ఊరటనిస్తుందని చెప్పారు. ఉచితంగా నాణ్యమైన విద్య అందించడం ద్వారా కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

విద్యార్థుల రవాణా సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా వాహన సదుపాయం కల్పిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఉదయం గ్రామాల నుంచి విద్యార్థులను పాఠశాలకు తీసుకువచ్చి, సాయంత్రం తిరిగి వారి ఇళ్ల వద్ద దింపే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నామని చెప్పారు. దీనివల్ల ముఖ్యంగా బాలికల విద్యకు ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు పోషకాహారం కూడా అందించనున్నట్లు తెలిపారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం మాత్రమే కాకుండా వారంలో కొన్ని రోజులు పాలు, రాగి జావ వంటి ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు అందిస్తామని చెప్పారు. విద్యతో పాటు ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య, డిజిటల్ లెర్నింగ్, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి అన్ని రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం అవసరమైన ప్రతి అంశాన్ని అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన సదుపాయాలు ప్రభుత్వ స్కూళ్లలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణలో విద్యా రంగంలో ఒక పెద్ద మార్పుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పవచ్చు. యంగ్ ఇండియా స్కూళ్లు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ద్వారా ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ కార్యక్రమాలు విజయవంతమైతే రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పూర్తిగా మారిపోతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కమలదళంలో నిధుల సెగ..?

**మొదటిపేజీ తరువాయి**

లోపించిందనే విమర్శలు వస్తున్నాయి. పార్టీ పంపిన నిధులకు మరియు ఎన్నికల్లో వచ్చిన ఓట్లకు, గెలిచిన వార్డులకు ఏమాత్రం పొంతన లేదని ఢిల్లీ నేతలు గుర్తించారు. ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా వార్డులను విభజించి భారీగా ఫండ్ పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. అయితే, పంపిన నిధులను కొందరు నేతలు తమ స్వప్రయోజనాల కోసం 'బొక్కేశారని', అభ్యర్థులకు సరైన సమయంలో నిధులు అందలేదని సమాచారం అందడంతో హైకమాండ్ సీరియస్ అయింది.

ఈ నిధుల గోల్‌మాల్‌పై ఇప్పటికే ఒకటి రెండుసార్లు పోస్ట్‌మార్టం నిర్వహించిన రాష్ట్ర బీజేపీ ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్, ఇప్పుడు లోతైన దర్యాప్తునకు ఆదేశించారు. నిధులు పక్కదారి పట్టిన విషయంలో ఏం చేయాలనే దానిపై ఆయన సీనియర్ నేతలతో సమావేశమయ్యారు. ఈ విచారణ కోసం ప్రత్యేకంగా కొందరు నేతలను ఎంపిక చేసి, ఒక్కో జిల్లాకు ఒక్కో నేతను పంపనున్నారు. పార్టీ నియమించిన ఈ నేతలు నేరుగా గ్రౌండ్ లెవల్‌లోకి వెళ్లి, పోటీ చేసిన అభ్యర్థులతో మాట్లాడనున్నారు. వారికి పార్టీ నుంచి అందిన డబ్బులు ఎన్ని? ఆ వార్డు ఏ కేటగిరీలో ఉంది? నిధుల పంపిణీలో పద్ధతి ప్రకారం జరిగిందా లేదా? వంటి అంశాలపై వీరు ఆరా తీయనున్నారు.

నివేదిక అందిన తర్వాత బాధ్యులైన వారిపై ఖచ్చితంగా చర్యలు ఉంటాయని అభయ్ పాటిల్ భరోసా ఇచ్చారు. కేవలం నిధుల విషయమే కాకుండా, పార్టీ శిక్షణ తరగతులు ఎలా జరుగుతున్నాయి మరియు పార్టీ క్రమశిక్షణ వంటి అంశాలపై కూడా పూర్తిస్థాయి రిపోర్టులను అధిష్టానం కోరినట్లు సమాచారం. ఈ నివేదికల అనంతరం తెలంగాణ బీజేపీలో కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది.



# పొంగులేటి.. పొగరు తగ్గించుకో, నీ చిట్టా నా దగ్గర ఉంది..

**మొదటిపేజీ తరువాయి**

సంబంధించిన ఆధారాలను బయటపెట్టారు. రాఘవ కన్స్ట్రక్షన్స్‌కు సంబంధించిన మైనింగ్ వ్యవహారాలపై మంత్రి పొంగులేటి చేస్తున్న బుకాయింపులను హరీష్ రావు ఎండగట్టారు. "అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మైనింగ్ మంత్రి స్వయంగా రాఘవ కన్స్ట్రక్షన్స్‌పై అక్రమ మైనింగ్ కేసులు పెట్టామని, పెనాల్టీలు వసూలు చేశామని చెబుతుంటే.. పక్కనే కూర్చున్న పొంగులేటి ఆరోజు ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని ప్రశ్నించారు. 12 రోజుల తర్వాత ఇప్పుడు తనకు ఆ మైనింగ్‌తో సంబంధం లేదని చెప్పడం కేవలం తప్పును కప్పిపుచ్చుకోవడమేనని మండిపడ్డారు.

ఈ మైనింగ్ వ్యవహారంపై రెవెన్యూ, విద్యుత్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, మైనింగ్ శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేశారని హరీష్ రావు వెల్లడించారు. ఈ నాలుగు శాఖల అధికారులు కూడా అది అనుమతులు లేని 'ఇల్లీగల్ మైన్' అని తేల్చారని, రాఘవ కన్స్ట్రక్షన్స్‌కు నోటీసులు కూడా ఇచ్చారని గుర్తు చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇచ్చిన నోటీసులను పొంగులేటి ఉద్యోగులే సంతకం పెట్టి తీసుకున్న డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

"మైనింగ్ ప్రాంతంలోని కంటైనర్ మీద రాఘవ కన్స్ట్రక్షన్ పేరు, కాంగ్రెస్ పార్టీ జెండా ఎందుకు ఉన్నాయి? బీఆర్ఎస్ పార్టీ ఈ అక్రమాలను నిలదీయగానే రాత్రికి రాత్రే ఆ పేరు కనబడకుండా పెయింటింగ్ ఎందుకు వేశారు?" అని హరీష్ రావు నిలదీశారు. పొంగులేటి అబద్ధాలు చెబుతూ మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పొంగులేటిని 'పొగరులేటి', 'పొంగు లూటీ' అని సంబోధిస్తూ, ఆయన అక్రమాల చిట్టా మొత్తం తన దగ్గర ఉందని హెచ్చరించారు.

నాదర్గుల్ భూముల విషయంలో కూడా పొంగులేటి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. 2016లోనే బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ భూములను నిషేధిత జాబితాలో పెట్టిందని, వాస్తవాలను దాచిపెట్టి చిల్లర కథలు చెబుతున్నారని మండిపడ్డారు. తన వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని, మంత్రి ఇప్పటికైనా బుకాయింపులు మానుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.



# హెచ్ఐవీ బాధితులకు గౌరవం ఇవ్వాలి

- **అవగాహనతోనే వ్యాధిపై గెలుపు సాధించొచ్చు**
- **మంత్రి దామోదర రాజనరసింహా సూచన**
- **హైదరాబాద్‌లో అవగాహన కార్యక్రమానికి హాజరు**
- **సమాజంలో అపోహలు తొలగించాలని పిలుపు**
- **హెచ్ఐవీ వ్యాప్తి మార్గాలపై స్పష్టత**
- **సాధారణ పరిచయాలతో వ్యాపించదని హితవు**
- **ఉచిత పరీక్షలు, చికిత్సపై ప్రభుత్వం దృష్టి**
- **వివక్ష చట్టరీత్యా నేరమని హెచ్చరిక**
- **యువతకు ఆరోగ్యంపై కీలక సూచనలు**
- **ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణమే లక్ష్యం**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

హెచ్ఐవీ బాధితులపై సమాజంలో ఇంకా కొనసాగుతున్న వివక్షను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహా పేర్కొన్నారు. హెచ్ఐవీ లేదా ఎయిడ్స్ బారిన పడిన వ్యక్తులను సామాజికంగా దూరంగా పెట్టడం సరికాదని, వారికి కూడా సమాన గౌరవం, హక్కులు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలోని కేబుల్ బ్రిడ్జ్ వద్ద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా భారీ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ర్యాలీలు, వైద్య శిబిరాలు, ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజలకు సరైన సమాచారం చేరవేస్తున్నామని చెప్పారు. అవగాహన పెరిగితేనే ఈ వ్యాధిని నియంత్రించవచ్చని ఆయన పేర్కొన్నారు.

హెచ్ఐవీ వైరస్ మన శరీరంలోని రోగనిరోధక శక్తిని క్రమంగా బలహీనపరుస్తుందని మంత్రి వివరించారు. సమయానికి పరీక్షలు చేయించుకోకుండా, చికిత్స తీసుకోకుండా ఉంటే అది ఎయిడ్స్ దశకు చేరుకుంటుందని తెలిపారు. ముఖ్యంగా రక్షణలేని లైంగిక సంబంధాలు, కలుషిత రక్త మార్పిడి, ఒకరికి వాడిన సూదిని మరొకరు ఉపయోగించడం వంటి కారణాలతో ఈ వైరస్ వ్యాపిస్తుందని చెప్పారు.అయితే సమాజంలో ఉన్న అనేక అపోహలను కూడా మంత్రి ఖండించారు. చేతులు కలపడం, ఆలింగనం చేసుకోవడం, కలిసి భోజనం చేయడం, దగ్గరగా కూర్చోవడం వంటి సాధారణ పరిచయాల ద్వారా హెచ్ఐవీ వ్యాపించదని స్పష్టం చేశారు. ఈ విషయంపై అవగాహన లేకపోవడం వల్లే బాధితులపై అనవసర భయాలు, వివక్ష పెరుగుతున్నాయని అన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ సరైన సమాచారం తెలుసుకోవాలని సూచించారు.

హెచ్ఐవీ బాధితులను తక్కువగా చూడడం చట్టరీత్యా కూడా నేరమని మంత్రి హెచ్చరించారు. హెచ్ఐవీ అండ్ ఎయిడ్స్ చట్టం 2017 ప్రకారం బాధితులపై వివక్ష చూపడం శిక్షార్హమని తెలిపారు. వారికి సమాన హక్కులు కల్పించడం, సహాయం చేయడం సమాజపు బాధ్యత అని పేర్కొన్నారు.ఇక ప్రస్తుతం హెచ్ఐవీ వ్యాధి పట్ల ఉన్న పరిస్థితి గతంతో పోలిస్తే చాలా మెరుగుపడిందని మంత్రి చెప్పారు. ఒకప్పుడు ఇది ప్రాణాంతక వ్యాధిగా భావించేవారని, కానీ ఇప్పుడు సరైన సమయంలో పరీక్షలు, చికిత్స తీసుకుంటే దీర్ఘకాలం సాధారణ జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. వైద్య రంగంలో వచ్చిన అభివృద్ధి వల్ల హెచ్ఐవీ బాధితులు కూడా సుదీర్ఘంగా ఆరోగ్యంగా జీవించగలుగుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఐవీ బాధితులకు పూర్తిస్థాయి సహాయం అందిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఉచితంగా పరీక్షలు, మందులు, చికిత్స అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 127 పరీక్షా కేంద్రాలు, 33 ఏఆర్టీ కేంద్రాల ద్వారా లక్షకు పైగా రోగులకు సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ సదుపాయాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.ప్రత్యేకంగా యువతకు మంత్రి కీలక సూచనలు చేశారు. అనారోగ్యకర అలవాట్లకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా డ్రగ్స్ వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని హెచ్చరించారు. ఇంజక్షన్ల ద్వారా మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల హెచ్ఐవీతో పాటు ఇతర ప్రమాదకర వ్యాధులు వ్యాపించే అవకాశముందని చెప్పారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి వ్యక్తి బాధ్యత అని అన్నారు.

వ్యక్తులు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది, కుటుంబాలు బలంగా ఉంటేనే సమాజం బలపడుతుందని మంత్రి పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం ద్వారానే బలమైన రాష్ట్రం సాధ్యమవుతుందని అన్నారు. హెచ్ఐవీపై అవగాహన పెంచడం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించవచ్చని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై సరైన అవగాహన పెంపొందించడం, బాధితులకు మద్దతు ఇవ్వడం, వివక్షను పూర్తిగా తొలగించడం సమాజం ముందున్న ముఖ్య కర్తవ్యమని ఈ కార్యక్రమం ద్వారా మరోసారి స్పష్టమైంది.



# బీర్కూర్ ఎస్సైగా వికె రాములు బాధ్యతలు స్వీకారం

**బీర్కూర్, ఏప్రిల్ 09(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా బీర్కూర్ పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా వికె రాములు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు బీర్కూర్‌లో ఎస్సైగా పనిచేసిన మహేందర్ గాంధారి బదిలీ కావడంతో ఆయన స్థానంలో బాన్సువాడ నుండి రాములు బీర్కూర్‌కు బదిలీ అయ్యారు.పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది సమక్షంలో రాములు అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో శాంతిభద్రతలను కాపాడటానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.




# కిమ్స్ హాస్పిటల్ లో సేఫ్ స్పైన్ సర్జరీ సూట్ ప్రారంభం

**సికింద్రాబాద్, ఏప్రిల్ 9 ( డిడి9 వార్త ):**

కిమ్స్ సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో సేఫ్ స్పైన్ సర్జరీ సూట్‌ను బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో గురువారం ప్రారంభించారు. ఈ టెక్నాలజీని తొలిసారిగా అందుబాటులోకి తీసుకువచ్చామని సంస్థ చైర్మన్ డాక్టర్ ఎ.వి. గురవారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆధునిక స్పైన్ నావిగేషన్, హై స్పీడ్ డ్రిల్స్, మైక్రోస్కోపీ వంటి సాంకేతికతలతో ఖచ్చితత్వంతో కూడిన చికిత్స అందించగలమన్నారు. గతంలో స్పైన్ సర్జరీల్లో కాంప్లికేషన్లు ఎక్కువగా ఉండేవని, ఇప్పుడు టెక్నాలజీతో వాటిని తగ్గించవచ్చన్నారు. సీనియర్ స్పైన్ సర్జన్ డాక్టర్ హిమాన్షు ప్రసాద్ మాట్లాడుతూ.... ఈ స్పైన్ సూట్ టెక్నాలజీ స్పైన్ చికిత్సలో కొత్త అధ్యాయమని పేర్కొన్నారు. స్పైన్ ఎండోస్కోపీ, అల్ట్రాసోనిక్ బోన్ స్కాల్పెల్, ఇంట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్ వంటి సదుపాయాలతో తక్కువ రక్తస్రావం, వేగంగా కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. నడుంనొప్పి ఉన్న ప్రతి ఒక్కరికి శస్త్రచికిత్స అవసరం లేదని, అవసరమైన వారికి మాత్రమే నిపుణుల పర్యవేక్షణలో ఆపరేషన్ చేస్తామని డాక్టర్ గురవారెడ్డి స్పష్టం చేశారు. ఇనిస్టిట్యూట్‌ను 20 ఏళ్ల క్రితం స్థాపించామని, ప్రస్తుతం 25 మందికి పైగా నిపుణులు సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆర్థోపెడిక్ గ్రూప్‌గా ఎదిగినట్లు చెప్పారు. వచ్చే వారం నుంచి బేగంపేటలో ఉచిత స్కోలియోసిస్ క్లినిక్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆంజనేయులు రెడ్డి, డాక్టర్ అనాగ్ చక్రవర్తి, డాక్టర్ ఎ. దినకర్ తదితరులు పాల్గొన్నారు.



# బరంగ్ ఏడ్గిలో వేగవంతంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

- **లబ్ధిదారుల ఇండ్లకు భూమిపూజ నిర్వహించిన అధికారులు, నాయకులు**

**బీర్కూర్, ఏప్రిల్ 09(డిడి9 వార్త):**

మండలంలోని బరంగ్ ఏడ్గి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని పంచాయతీ కార్యదర్శి గురునాథ్ తెలిపారు. గ్రామంలోని 10వ వార్డులో ఇందిరమ్మ లబ్ధిదారులు గోండ్ల శాంతవ్వ, గోండ్ల బాలమణి ఇండ్ల నిర్మాణానికి గురువారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గురునాథ్ మాట్లాడుతూ పేదలకు స్వంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం గ్రామాల్లో ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అధికారులు, గ్రామ నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ద్వారా పేద కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించబడుతుందని, లబ్ధిదారులు కూడా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకునేలా సహకరించాలని సూచించారు. గ్రామంలో ఇప్పటికే పలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమై పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు.అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోండ్ల రాజు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని ప్రతి లబ్ధిదారు సద్వినియోగం చేసుకుని తమ కలల ఇంటిని నిర్మించుకోవాలని కోరారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బోయి లాలయ్య, అన్న వరలక్ష్మి, గ్రామ నాయకులు కాదేపురం గంగన్న, ఇందూర్ గజేందర్, మొండ్కారి కామప్ప, మేత్రి నాగుగొండ, నీరడి రాములు, క్యాదని లక్షప్ప, శావులం శంకర్, గోండ్ల పెద్ద భూమయ్య, చిన్న భూమయ్య తదితరులు పాల్గొన్నారు.





# టైగర్ నరేందర్‌కు ఘన నివాళులు

**సికింద్రాబాద్, ఏప్రిల్ 09 ( డిడి9 వార్త):**

టైగర్ నరేందర్ వర్ధంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు నివాళులు అర్పించి, టైగర్ నరేందర్ సేవలను స్మరించారు.నగర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టైగర్ నరేందర్ సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని నేతలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మల్లేష్, పొట్లకాయల వెంకటేశ్వర్లు, నీరజ ముదిరాజ్ తదితరులు పుష్పాంజలి ఘటించి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. పార్టీ శ్రేణులు ఆయన ఆశయాలను కొనసాగించాలని సంకల్పం వ్యక్తం చేశారు.





# ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా భారీ ర్యాలీ

**కామారెడ్డి, ఏప్రిల్ 09(డిడి9 వార్త):**

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 6 నుంచి 11 వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా గురువారం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, ప్రజల్లో ఆరోగ్య సంరక్షణ పట్ల చైతన్యం కలిగించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో భాగంగా సంపూర్ణ సురక్ష కేంద్రం, ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా ప్రత్యేక వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్య వారోత్సవాల ద్వారా ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడమే లక్ష్యమని, ముఖ్యంగా మహిళలు, పిల్లలు మరియు ప్రత్యేక వర్గాల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. పరిశుభ్రత, పోషకాహారం, నివారణాత్మక వైద్యంపై దృష్టి పెట్టడం ద్వారా అనేక వ్యాధులను ముందుగానే నివారించవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి రవీందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్, డీసీహెచ్ఎస్ విజయ భాస్కర్ రెడ్డి, ఆర్డీవో ఎన్.వి. గిరి, తహసీల్దార్ హిమబిందు, డీపీఆర్ఓ తిరుమల, ఎంపీడీఓ రాణి, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయంకు వెళ్లే దారి ఆక్రమిస్తూ పౌల్ట్రీ నిర్మాణంఅధికారులు మౌనం – ఓ రైతు ఆవేదన.

- **భీమ్ ఆర్మీ అసెంబ్లీ ప్రెసిడెంట్ భగత్ ప్రవీణ్**


**ఆదిలాబాద్-డిడి9వార్త ప్రతినిధి :**









ఆదిలాబాద్ జిల్లాబోథ్ నియోజక వర్గంలోని సొనాల గ్రామంకు చెందిన భగత్ ప్రవీణ్ అనే ఒక రైతు తాను రెండు సంవత్సరంల నుంచి ఆయనరెండున్నర ఎకరాల పొలానికి వెళ్ళటానికి ఉన్న దారి మూసివేసి ఒక కోళ్ల ఫారం కోసం ఒక పెద్ద నిర్మాణంలు చేస్తున్న కారణంగా ఆయన వ్యవసాయపనులను చేసుకొనుటకు వీలు లేక ఆటంకం ఏర్పడుతుంది. అని ఆయన తన బాధను పత్రిక ముఖంగా ఆవేదనను వ్యక్తం చేశారు.ఆయన వ్యవసాయం బందు పడి ఆర్థికంగా నష్ట పోతున్నానని, గతంలో ఉన్న దారి తెరిపించి ఆదుకోవాలని అధికారులను,ప్రభుత్వంను కోరుతున్నారు. ఆయన బాధ తన మాటల్లో ఈ విదంగాతెలియజేస్తున్నారు. నాకుసొంతంగా 2 ఎకరాల 35 గుంటల వ్యవసాయ భూమి గ్రామ ఓ సొనాల శివారం,మండలం సొనాల,జిల్లా ఆదిలాబాద్లోఉంది. ఆ భూమికి వెళ్లే దారిలో విమల సంతోష్‌సింగ్ పౌల్ట్రీ ఫార్మ్ అనే పేరుతో విక్రమ్ సింగ్ (అడ్వకేట్) అక్రమంగా పౌల్ట్రీ ఫార్మ్ నిర్మాణం చేపడుతున్నారు.ఈ నిర్మాణంతో మా భూమికి వెళ్లే దారికి అడ్డంకిగా మారింది.ఈ సమస్య కారణంగాగత3సంవత్సరాల నుంచి మా వ్యవసాయం పూర్తిగా ఆగి పోయింది. దాంతో రైతుగా నాకు తీవ్ర ఆర్థిక నష్టం & ఇబ్బందులు ఎదురవుతున్నాయి.ఈ దారిని అక్రమంగా అక్రమించినిర్మాణాన్నిచేపడుతున్న దానిని నిలిపి వేయాలని కోరుతూ మేము సంబంధిత అధికారులకు ఇప్పటికే పలు మార్లు వినతి పత్రాలుసమర్పించాము .సొనాల మండల తహసీల్దార్ ,ఎంపీడీఓలకు వినతిపత్రంలు ఇచ్చాము.గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్ కి మూడు (3) సార్లు























వినతిపత్రాలు ఇచ్చాము. అయిన స్పందన లేక పోవడంతో సొనాల తహసీల్దార్ కి ఆర్టీఐ చట్టం కింద దరఖాస్తును కూడా దాఖలు చేశాము.అయితే, తహసీల్దార్ కి ఆర్టీఐ దరఖాస్తు ఇచ్చి నెలలు గడిచినా ఇప్పటివరకు ఎటువంటి సమాధానం లేదు.బోథ్ భీమ్ ఆర్మీ అసెంబ్లీ ప్రెసిడెంట్ను అయినా నాకు ఇలాంటి పరిస్థితి ఎదురైతే, సాధారణ రైతుల పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలి. రైతులసమస్యలను తక్షణమేపరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వఅధికారులపై ఉంది. కాబట్టి, ఈ సమస్యను ఆదిలాబాద్ జిల్లా పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లి, అక్రమంగా జరుగుతున్నపౌల్ట్రీఫార్మ్ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి, రైతుకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని మాకు న్యాయం చేయాలని కోరుతున్నామని భీమ్ఆర్మీ అసెంబ్లీ ప్రెసిడెంట భగత్ ప్రవీణ్ కోరారు.



# బరంగ్ ఏడ్గిలో వేగవంతంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

- **లబ్ధిదారుల ఇండ్లకు భూమిపూజ నిర్వహించిన అధికారులు, నాయకులు**

**బీర్కూర్, ఏప్రిల్ 09(డిడి9 వార్త):**

మండలంలోని బరంగ్ ఏడ్గి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని పంచాయతీ కార్యదర్శి గురునాథ్ తెలిపారు. గ్రామంలోని 10వ వార్డులో ఇందిరమ్మ లబ్ధిదారులు గోండ్ల శాంతవ్వ, గోండ్ల బాలమణి ఇండ్ల నిర్మాణానికి గురువారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గురునాథ్ మాట్లాడుతూ పేదలకు స్వంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం గ్రామాల్లో ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోందన్నారు. గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి అధికారులు, గ్రామ నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ద్వారా పేద కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించబడుతుందని, లబ్ధిదారులు కూడా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకునేలా సహకరించాలని సూచించారు. గ్రామంలో ఇప్పటికే పలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమై పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు.అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోండ్ల రాజు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని ప్రతి లబ్ధిదారు సద్వినియోగం చేసుకుని తమ కలల ఇంటిని నిర్మించుకోవాలని కోరారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు బోయి లాలయ్య, అన్న వరలక్ష్మి, గ్రామ నాయకులు కాదేపురం గంగన్న, ఇందూర్ గజేందర్, మొండ్కారి కామప్ప, మేత్రి నాగుగొండ, నీరడి రాములు, క్యాదని లక్షప్ప, శావులం శంకర్, గోండ్ల పెద్ద భూమయ్య, చిన్న భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ హోమియోపతి ఆయుష్ వేడుకలు.

**నిర్మల్, ఏప్రిల్: 09 :(డిడి 9వార్త ప్రతినిధి):**

తెలంగాణ ప్రభుత్వం తరపున నిర్వహించే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా డిపార్ట్మెంట్ ఆఫ్ ఆయుష్ నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో ఏప్రిల్ ఆరవ తేదీ నుండి ఏప్రిల్ 11వ తేదీ వరకు వేడుకలు నిర్వహించడం జరుగుతోంది .ఇందులో భాగంగా 10 ఏప్రిల్ 2026 న ప్రపంచ హోమియోపతి మరియు ఆయుష్ దినోత్సవం వేడుకలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్ నిర్మల్ లో నిర్వహించడం జరుగుతుందని నోడల్ అధికారి డాక్టర్ నారాయణ రావు గారు తెలియజేశారు. ఇందులో భాగంగా ఉదయం 6.30 గంటల నుండి 7:30 గంటల వరకు యోగ మరియు యోగా అవగాహన శిబిరం మరియు ఉదయం 9:30 గంటలకు ఆయుష్ మెగా క్యాంపు నిర్వహించడం జరుగుతుంది.





ఈ క్యాంపులో అనుభవజ్ఞులైన వైద్యులచే చికిత్సను అందించడంతోపాటు మందులు ఉచితంగా ఇవ్వగలరు కావున నిర్మల్ జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరుతున్నారు.

# మానవత్వాన్ని చాటిన యాపలగూడ 2వ బెటాలియన్ కమాండెంట్.

**ఆదిలాబాద్, ఏప్రిల్ : 09 :(డిడి 9వార్త ప్రతినిధి ) :**

ఆదిలాబాద్ జిల్లా ఆదిలాబాద్ రూరల్ మండలం లోని యాపల్ గూడ 2వ బెటాలియన్ టి జి ఎస్ పి (ఐ ఆర్) కమాండెంట్ బి. వెంకటేశ్వర రెడ్డి నిర్మల్ జిల్లా భైంసా వైపు ప్రయాణిస్తుండగా, రహదారి మధ్యలో ఒక వ్యక్తి అకస్మాత్తుగా పడిపడి ఫిట్స్ తో బాధపడు తున్నట్లు గమనించారు. వెంటనే అప్రమత్తమైన కమాండెంట్ తమ వాహనాన్ని ఆపి, సిబ్బందితో కలిసి ఆ వ్యక్తిని సురక్షిత స్థలానికి తరలించి, ప్రాథమిక చికిత్సఅందించారు. అనంతరం సమీప ఆసుపత్రికి తరలించేలా ఏర్పాట్లు చేసి, ఆ వ్యక్తి ప్రాణాలనుకాపాడటంలో కీలక పాత్ర పోషించారు.ఈ సంఘటనలో కమాండెంట్ వేగవంతమైన స్పందన, మానవత్వం, సేవాభావం ప్రతిఫలించాయి. ప్రజల ప్రాణాలను కాపాడడం పోలీసుల ప్రధాన బాధ్యత అని మరోసారి చాటి చెప్పారు.స్థానిక ప్రజలుకమాండెంట్ సేవలనుఅభినందిస్తూ, ఆయన చూపిన మానవత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



# నిజామాబాద్ సెంట్రల్ జైలులో ఖైదీలకు వైద్య పరీక్షలు

**నిజామాబాద్ జిల్లా 09 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిజామాబాద్ సెంట్రల్ జైలులో ఖైదీల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు సుమారు 640 మంది ఖైదీలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్ బి & సి, మరియు క్షయ (టీబీ) నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. ఈ పరీక్షలతో పాటు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఖైదీలకు కంటి సమస్యలు, చర్మవ్యాధులు, దంత వైద్యం, గైనకాలజీ మరియు గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించి, అవసరమైన వారికి సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి.రాజశ్రీ మాట్లాడుతూ.. ఖైదీల ఆరోగ్యాన్ని కాపాడటంలో భాగంగానే ఈ సమగ్ర వైద్య తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో జిల్లా టీబీ నియంత్రణ అధికారి మరియు ఎయిడ్స్, కుష్ఠు వ్యాధి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దేవి నాగేశ్వరి, ఎన్.వి.హెచ్.సి.పి నోడల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేష్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సామ్రాట్ యాదవ్, డాక్టర్ అవంతి, డి.హెచ్.ఇ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది, జిల్లా టీబీ నియంత్రణ విభాగం, మొబైల్ ఐ.సి.టి.సి బృందాలు, జిల్లా వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.






# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

**నిజామాబాద్ పోతంగల్, ఏప్రిల్ 09 (డిడి9 వార్త ):**

నిజామాబాద్ జిల్లా పొంతగల్ మండలం లోని చేతన్ నగర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన బీజేపీ కార్యకర్త ఏరోళ్ళ యోగాజీ అనారోగ్యం తో బాధపడుతున్న విషయం స్టానిక బీజేపీ నాయకుల విషయం తెలుసుకున్న బాన్సువాడ నియోజకవర్గ బీజేపీ నాయకులు ఎన్నారై కోనేరు శశాంక్ గారు వారికి 5,000 రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది ఈ కార్యక్రమం లో చేతన్ నగర్ గ్రామ సర్పంచ్ కుర్వాడే కాంత సునీల్ ఉప సర్పంచ్ యాదవ్ రావు పొంతగల్ మండల మహిళా మోర్చా నాయకురాలు గంగుబాయి, సీనియర్ నాయకులు మార్కేలి ప్రకాష్ పటేల్,వెంకగౌడ్,విజయ్, లక్ష్మణ్,ఆలపాటి హరికృష్ణ,సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగింది.



# బోథ్ అటవీ శాఖ కార్యాలయంలో ఏసీబీ దాడులు...

**బోథ్, ఏప్రిల్ 09-డిడి 9వార్త :**




15 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా గురువారం రోజు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ప్రణయ్, జూనియర్‌అసిస్టెంట్ పర శురామ్ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు. అర్బన్ పార్క్ లో మొక్కలకు నీరు పోసిన వ్యక్తి నుంచి బిల్లు మంజూరు చేసినందుకు 15 వేల రూపాయల రివార్డ్ డిమాండ్. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో రెడ్ హ్యాండెడ్గాపట్టుకున్న ఏసీబీ అధికారులు.ఈ రోజు టి. ప్రణయ్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, 0/0 ది ఎఫ్ఆర్ఓ బోథ్, బోథ్ రేంజ్ &ఎస్. పరశురామ్, జూనియర్ అసిస్టెంట్, బోథ్ రేంజ్లను ఆదిలాబాద్ జిల్లా ఏసీబీ నెట్‌లో ఉంది. ఏప్రిల్ 9.న, బోథ్ రేంజ్, ఎఫ్.ఆర్.ఓ బోత్ కార్యాలయంలో పనిచేస్తున్న నిందిత అధికారి టి. ప్రణయ్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్,ఆదిలాబాద్ ఏసీబీ యూనిట్ చేత పట్టుబడ్డాడు.ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద హరిత హారం ప్రాజెక్ట్ కోసం ఫిర్యాది సరఫరా చేసిన నీటికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూపాయలు. 5,09,000లచెక్కును క్లియర్చేయించినందుకుగాను, అధికారికంగా సహాయం చేసినందుకు ప్రతిఫలంగా, అతను బోథ్ రేంజ్ జూనియర్ అసిస్టెంట్, ఏఓ2 ఎస్. పరశురామ్ ద్వారా ఫిర్యాది నుంచి బహుమతిగా రూపాయలు15,000లను డిమాండ్ చేసి, స్వీకరించాడు.AO2 సూచన మేరకు అతని స్వాధీనంలో ఉన్న రూపాయలు 15,000లను కలుషితమైన లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఈ విధంగా AO1&AO2తమఅధికారికపదవినిదుర్వినియోగం చేసి అక్రమప్రయోజనం పొందడానికి తమ విధులను అక్రమంగా, నిజాయితీ లేకుండా నిర్వర్తించారు.అందువల్ల, ఏఓ1 &ఏఓ2 లను అదుపులోకి తీసుకుని, అరెస్టు చేసి, కరీంనగర్‌లోని ఎస్పిఈ & ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరచడం జరుగుతోందని, కేసు దర్యాప్తులో ఉందని, భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుని వివరాలు గోప్యంగా ఉంచబడ్డాయి.సెల్ ఫోన్ నంబర్1064 (టోల్ ఫ్రీ నంబర్):ఏదైనా ప్రభుత్వ అధికారి లంచం డిమాండ్ చేసిన సందర్భంలో, చట్ట ప్రకారం చర్య తీసుకోవడం కోసం ప్రజలు ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ అయిన 1064ను సంప్రదించవలసిందిగా కోరడమైనది. ఏసీబీ తెలంగాణను సోషల్ మీడియాప్లాట్‌ఫారమ్‌లైనవాట్సాప్(9440446106), ఫేస్‌బుక్ (తెలంగాణ ఏసీబీ ), మాజీ/పూర్వపు ట్విట్టర్ (@తెలంగాణ ఏసీబీ ) ద్వారా కూడాసంప్రదించవచ్చు . బాధితుని ఫిర్యాదుదారుని పేరు & వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఏసీబీ అధికారులు తెలిపారు.





# మన ఊరు మన భద్రత మన బాధ్యత : సీపీ పి.సాయి చైతన్య

**నిజామాబాద్ జిల్లా 09 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాల కట్టడి, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆర్మూర్ కన్వెన్షన్ హాల్‌లో 'మన ఊరు మన భద్రత మన బాధ్యత' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య ఐపీఎస్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, కొత్తగా ఎన్నికైన గ్రామ సర్పంచులకు సామాజిక భద్రతపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్ 2026' కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతా నియమాలపై సీపీ కీలక సూచనలు చేశారు. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసే సమయంలో భద్రతా కోన్లు, రేడియం స్టిక్కర్లు వాడాలని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ వాడకం ప్రాణాపాయమని హెచ్చరించారు. అధిక వేగం, అజాగ్రత్త వల్ల జరిగే ప్రమాదాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్మూర్ రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి తల్లిదండ్రులు తమ ఆవేదనను పంచుకోగా సభికులందరితో అరైవ్ అలైవ్ ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ సర్పంచులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ బస్వా రెడ్డి, ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లహరి రఘు, ఏసీపీలు వెంకటేశ్వర రెడ్డి, వెంకటేశ్వర్లు, స్థానిక సీఐలు, ఎస్ఐలు, సర్పంచులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఏఎన్ఎంలు విధుల్లో సమయపాలన పాటించాలి : డిఎంహెచ్ఓ

**నిజామాబాద్ జిల్లా 09 ఏప్రిల్ (డీడీ9 వార్త):**





జిల్లా వైద్య ఆరోగ్య శాఖలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ పై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి. రాజశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏఎన్ఎంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు అందించే వైద్య సేవలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీల నమోదు, ఆసుపత్రి ప్రసవాలు, వ్యాధి నిరోధక టీకాలు, మాతా శిశు మరణాల వివరాలతో పాటు జీవనశైలి వ్యాధుల నిర్ధారణ పరీక్షల డేటాను హెచ్ఎంఐఎస్ పోర్టల్‌లో వెంటనే నిక్షిప్తం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ విధుల్లో సమయపాలన పాటిస్తూ, ఉప కేంద్రాల వారీగా కేటాయించిన లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డీడీఎం నారాయణ, హెచ్ఈఓ శ్రీనివాస్ ఏఎన్ఎంలకు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. దీని ద్వారా జిల్లాలో వైద్య సేవల పర్యవేక్షణ మరింత సులభతరం కానుందని అధికారులు వెల్లడించారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**నిజామాబాద్ జిల్లా 09 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

గత ఐదేళ్లుగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ డిమాండ్ చేసింది. నిజామాబాద్ నగరంలోని ఒక ప్రైవేట్ కళాశాలలో నిర్వహించిన తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వానికి విన్నవించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రీయింబర్స్మెంట్ బకాయిలు రాకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారిని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతున్నామని గుర్తు చేశారు. బకాయిలు విడుదల కాకపోవడంతో గత కొన్ని నెలలుగా సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని దీన స్థితిలో ఉన్నామని, ప్రభుత్వం తమ పరిస్థితిని అర్థం చేసుకుని తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు. అనంతరం ప్రధాన కార్యదర్శి నరాల సుధాకర్ మాట్లాడుతూ.. బకాయిల చెల్లింపులో జాప్యం జరిగితే కళాశాలలు మూతపడటం ఖాయమని, దీనివల్ల వేలాది మంది ఉద్యోగుల కుటుంబాలు వీధిన పడతాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు గురువేందర్ రెడ్డి, సూర్య ప్రకాష్, సంజీవ్, సత్యం, హకీమ్, రమణ, వెంకట కిషన్, భూమయ్య, హరికృష్ణ, విజయ్, నవీన్, చందన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.






# ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం

- **ఘనంగా 'రెడ్ వాక్' అవగాహన ర్యాలీ**

**నిజామాబాద్ జిల్లా 09 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

జిల్లాలో ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా సాగుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల ఆరోగ్య మిషన్, ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా భారీ ఎయిడ్స్ అవగాహన వాకథాన్ (రెడ్ వాక్) నిర్వహించారు. నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి.రాజశ్రీతో కలిసి జెండా ఊపి ఈ ర్యాలీని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే ఆ మహమ్మారి బారిన పడకుండా తమను తాము రక్షించుకోగలరని, సమాజంలో ఈ వ్యాధి పట్ల ఉన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. ఈ వాకథాన్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి గాంధీ చౌక్ మీదుగా సాగి తిరిగి ఆసుపత్రి వద్దే ముగిసింది. ర్యాలీ అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి.రాజశ్రీ జీజీహెచ్‌లోని సంపూర్ణ సురక్ష కేంద్రం వద్ద రోగ నిర్ధారణ పరీక్షల క్లినిక్‌ను, అలాగే ట్రాన్స్‌జెండర్ల కోసం మైత్రి క్లినిక్ వద్ద ప్రత్యేక పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించి వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జలగం తిరుపతి రావు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ దేవి నాగేశ్వరి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ అశ్విని, వివిధ విభాగాల వైద్య అధికారులు డాక్టర్ వెంకటేష్, డాక్టర్ శ్రావ్య, డాక్టర్ అవంతి, డీహెచ్ఈ జి.వెంకటేశ్వర్లు, డీపీఎం సుధాకర్, స్నేహ సొసైటీ ప్రతినిధి సిద్దయ్యతో పాటు ఆఫీసర్ క్లబ్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఆర్మూర్ లో 22 సీసీ కెమెరాలు ప్రారంభం




**నిజామాబాద్ జిల్లా 09 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 22 సీసీ కెమెరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య గురువారం ప్రారంభించారు. కాలనీలోని భక్త ఆంజనేయ మందిరం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నేరాల నివారణలో సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, వీటి ద్వారా పట్టణంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను ఎప్పటికప్పుడు కనిపెట్టవచ్చని సీపీ తెలిపారు. నేరస్తులను పట్టుకోవడమే కాకుండా, ట్రాఫిక్ నియంత్రణకు కూడా ఈ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలందరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ప్రాంతాల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా సురక్షితమైన సమాజానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కెమెరాల ఏర్పాటుతో కాలనీలో భద్రత పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీబీ వెంకటేశ్వర రెడ్డి, ఎస్హెచ్ఓ సత్యనారాయణ, కౌన్సిలర్ విజయ్ అగర్వాల్, జర్నలిస్ట్ కాలనీ అధ్యక్షులు రాజేందర్ గౌడ్, సాంకేతిక నిపుణులు ప్రవీణ్ చారి మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.



# కొప్పర్తి క్యాంప్, ఫతేపూర్, హున్సా గ్రామాల్లో ఎంపీడీఓ శ్రీనివాస్ తనిఖీలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 09 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

సాలూర మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సాగుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీఓ శ్రీనివాస్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొప్పర్తి క్యాంప్, ఫతేపూర్ మరియు హున్సా గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ పనులు, అంగన్వాడీ కేంద్రాల పనితీరును తనిఖీ చేశారు. ముందుగా కొప్పర్తి క్యాంప్, ఫతేపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన, కూలీల హాజరును మరియు పని నాణ్యతను తనిఖీ చేశారు. వేసవి దృష్ట్యా కూలీలకు పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ వంటి వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం హున్సా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం మరియు రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కేంద్రం ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో స్థానిక పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



## నేడు సాలూర రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 09 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

రైతులకు లాభదాయకమైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఈ రోజు ఉదయం 10 గంటలకు సాలూర రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు వ్యవసాయ విస్తరణ అధికారి అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. ఈ పంటకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాలు మరియు సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఈ సమావేశంలో సమగ్రంగా వివరించనున్నట్లు తెలిపారు. సాలూర క్లస్టర్ పరిధిలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని అపర్ణ కోరారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకుని ఆయిల్ పామ్ సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# కల్దుర్కిలో అర్ధరాత్రి దొంగల హల్చల్: బంగారం, నగదు అపహరణ

**బోధన్, నిజామాబాద్ జిల్లా 09 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దొంగలు హల్చల్ చేశారు. తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడి భారీగా నగదు, నగలను ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దత్తు అనే వ్యక్తి రాత్రి తన ఇంటిపై నిద్రిస్తుండగా గుర్తుతెలియని దుండగులు కింద ఉన్న ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న రూ. 20 వేల నగదు, 30 తులాల వెండి, తులం బంగారంతో పాటు రెండు సూట్‌కేసులు, నగదుకు సంబంధించిన పత్రాలను ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోతున్నారు. ఉదయం నిద్రలేచి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉండటం, సామాన్లు చెల్లాచెదురుగా పడి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో గ్రామస్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురవుతున్నారు.

# గూఢచారి 2 పై సాలిడ్ అప్డేట్ ఇచ్చిన శేష్!

వరుస సినిమాలతో, విభిన్నమైన కథలతో సక్సెస్ అందుకుంటున్న యంగ్ హీరో అడివి శేష్. టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు సాధించుకున్న ఈ సక్సెస్‌ఫుల్ హీరో, ఏ సినిమా చేస్తున్న అది హిట్ సాధిస్తుందనే నమ్మకం సగటు సినిమా ప్రేమికుల్లో ఏర్పడిందంటే అది అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఈ యంగ్ హీరో కొత్త సినిమా డెకాయిట్ విడుదలకు సిద్ధం అవుతుంది. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాపై ప్రేక్షకులలో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి.

ఈ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నటిస్తున్న తదుపరి చిత్రం గూఢచారి 2. 'గూఢచారి'కి సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం భారీ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతుంది. ఈ సినిమా కోసం సినీ ప్రియులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ మూవీ విడుదలపై వస్తున్న వార్తలకు తాజాగా అడివి శేష్ ఫుల్ స్టాప్ పెట్టారు. భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కుతున్న 'G2' మరో మూడు నెలల్లోనే థియేటర్లలోకి వస్తుందని సోషల్ మీడియా వేదికగా వస్తున్న వార్తలకు ఈ యంగ్ హీరో తాజాగా చెక్ పెట్టారు. ఈ సినిమా షూటింగ్ ఇంకా కంప్లీట్ కాలేదని, భారీ స్థాయిలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు బ్యాలెన్స్ ఉండటంతో అవన్నీ పూర్తి చేసుకొని ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివరలో చేస్తామని శేష్ స్పష్టం చేశారు. క్యాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

తన బాలీవుడ్ ఎంట్రీ గురించి శేష్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. పాన్ ఇండియా లెవల్లో 'మేజర్' సినిమా సూపర్ హిట్ కావడంతో హిందీలో ఆయనకు ఏకంగా ఆరు భారీ ఆఫర్లు వచ్చాయట. అయితే వాటిని శేష్ సున్నితంగా తిరస్కరించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తనకు వచ్చిన ఆరు ఆఫర్లలో నాలుగు వార్ మూవీస్ కాగా, రెండు బయోపిక్‌లు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఒకే రకమైన పాత్రలకు లేదా జోనర్లకు పరిమితం కాకూడదనే ఉద్దేశంతోనే వాటిని వద్దనుకున్నట్లు తెలిపారు. మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ జీవిత కథతో తీసిన 'మేజర్' తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని, ఆ సినిమా తనకు సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. అది పూర్తయిన తర్వాత మళ్లీ అటువంటి జోనర్ల జోలికి వెళ్లనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో యుద్ధ సినిమాలు లేదా బయోపిక్‌లు చేసే ఉద్దేశం లేదని, విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరించడమే తన లక్ష్యమని తేల్చి చెప్పారు. ప్రస్తుతం తన ఫోకస్ అంతా 'G2' పైనే ఉందని, ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త యాక్షన్ అనుభూతిని ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు.




# ఆమె మేకప్ ఆర్టిస్ట్ మాత్రమే కాదు.. ప్రీతీశీల్‌పై 'ధురంధర్' డైరెక్టర్ ప్రశంసలు

'ధురంధర్' సినిమాలకు వర్క్ చేసిన మేకప్, ప్రోస్థటిక్ ఆర్టిస్ట్ ప్రీతీశీల్ సింగ్‌పై ఆదిత్యధర్ ప్రశంసలు కురిపించారు. ప్రీతితో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. ఆమె ప్రతిభ గురించి అభిమానులకు చెప్పారు. 'ధురంధర్' కోసం ఆమెను సంప్రదించిన క్షణాలను గుర్తుచేసుకున్నారు

''ధురంధర్' కోసం ప్రీతి పేరును కొందరు నాకు సూచించినప్పుడు నేను సందేహించా. అహంకారి అని, పారితోషికం ఎక్కువ అడుగుతుందని, భారీ ప్రాజెక్టులు మాత్రమే చేస్తుందని.. ఇలా ఆమె గురించి అంతకుముందు నేను విన్న మాటలే ఇందుకు కారణం. తర్వాత మనసు మార్చుకుని ఆమెను కలిశా. ఒక్క మీటింగ్‌లోనే అవన్నీ అవాస్తవాలని అర్థమైంది. ఇతరుల అభిప్రాయలపై ఆధారపడి ఎవరినీ అపార్థం చేసుకోకూడదని అనుకున్నా. ప్రీతి అసాధారణ ప్రతిభ కలిగిన ఆర్టిస్ట్ మాత్రమే కాదు.. మంచి మనిషి కూడా. అందరితోనూ ఎంతో ఆప్యాయంగా ఉంటుంది. సినిమాలోని ప్రతి పాత్ర గురించి, జీవితం గురించి సుదీర్ఘ చర్చలు సాగించేవాళ్లం. ఆ జ్ఞాపకాలు జీవితాంతం మర్చిపోలేనివి''

''ప్రీతి, ఆమె టీమ్ చాలా కష్టపడింది. మేం నిద్ర లేచే సమయానికే వాళ్లు సెట్‌స్‌లో ఉండేవారు. అందరూ వెళ్లిన తర్వాతే వాళ్లు సెట్స్ నుంచి వెళ్లేవారు. రోజుకు రెండు/మూడు గంటలపాటు నిద్రపోయేవారు. విజన్‌కు తగ్గట్టు అంకితభావంతో పని చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి పాత్రకూ సహజత్వాన్ని తీసుకొచ్చారు. ఇలా చేయడం అరుదు. ప్రీతి నా కుటుంబ సభ్యురాలు. నా సోదరి'' అని ఆదిత్య పేర్కొన్నారు. అల్లు అర్జున్ బ్లాక్‌బస్టర్ మూవీ 'పుష్ప' సినిమాకూ ప్రీతి వర్క్ చేశారు.




# ఆ తేదీన విడుదల కానున్న 'స్వయంభు'

టాలీవుడ్ యువ నటుడు నిఖిల్ సిద్ధార్థ్ ప్రస్తుతం 'స్వయంభు' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో సంయుక్తా మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా కనిపించనుండగా, భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాత ఠాగూర్ మధు భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. భారీ గ్రాఫిక్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించి గతంలో పలు విడుదల తేదీలు ప్రచారంలోకి వచ్చినప్పటికీ, వీఎఫ్ఎక్స్ పనుల ఆలస్యంతో సినిమా విడుదల పదేపదే వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన సగం సీజీ పనులు సంతృప్తికరంగా పూర్తయ్యాయని, ప్రస్తుతం రెండో సగానికి సంబంధించిన సీజీ పనులు వేగంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అవి కూడా మరికొన్ని రోజుల్లో పూర్తయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. మే 15వ తేదీ నాటికి అన్ని పనులను పూర్తి చేసి, మే 22న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సగభాగం సీజీ పనులు పూర్తవడంతో, మూవీ టీమ్ ఓటీటీ డీల్ కోసం కూడా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం జీ5, నెట్‌ఫ్లిక్స్ సంస్థలతో చర్చలు కొనసాగుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.



# ధురంధర్ – 2.. రెండు వేల కోట్ల మార్క్ అందుకోవడం అసాధ్యం



రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో రూపొందిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట కొనసాగిస్తోంది. బాలీవుడ్ యాక్షన్ సినిమాల లెక్కలను తిరగరాస్తూ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. రణవీర్ సింగ్ కెరీర్‌లోనే అత్యంత భారీ వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచిన ఈ సినిమా ప్రస్తుతం మూడవ వారంలో కూడా నిలకడగా కలెక్షన్లను రాబడుతోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 1650 కోట్లు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి 2026లో అత్యధిక వసూళ్లు రాబట్టిన భారతీయ చిత్రంగా రికార్డు సృష్టించింది.

తొలి వారంలోనే రికార్డు స్థాయి ఓపెనింగ్స్ సాధించిన ఈ చిత్రం దేశీయంగా రూ. 1000 కోట్ల మార్కును దాటిన తొలి హిందీ సినిమాగా చరిత్ర సృష్టించింది. కేవలం ఇండియాలోనే కాకుండా నార్త్ అమెరికా వంటి ఓవర్సీస్ మార్కెట్లలో కూడా అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోంది. మూడవ వారంలో అడుగుపెట్టినప్పటికీ, వర్కింగ్ డేస్‌లో కూడా సింగిల్ డిజిట్ పడిపోకుండా స్టడీగా వసూళ్లను రాబడుతున్నప్పటికి అయినప్పటికీ, ఫైనల్ రన్‌లో రూ. 2000 కోట్ల మార్కును అందుకోవడం ఒకింత కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సినిమా విడుదలై మూడు వారాలు గడవడంతో సహజంగానే థియేటర్ల సంఖ్య మరియు ఆక్యుపెన్సీ కొంత తగ్గింది. దానికి తోడు ఐపీఎల్ ప్రభావం కొంత మేర చూపిస్తోంది. రెండు వేల కోట్ల మార్కును చేరుకోవడానికి ఇంకా రూ. 350 కోట్లు రాబట్టాలి. ప్రస్తుత ట్రెండ్‌ను బట్టి చూస్తే ఈ స్థాయి వసూళ్లు సాధించాలంటే లాంగ్ రన్‌లో అద్భుతాలు జరగాలి. మొత్తానికి 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద ఒక గొప్ప విజయాన్ని అందుకుని భారతీయ సినిమా చరిత్రలో టాప్ 5 అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలవడం ఖాయం. రణవీర్ సింగ్ మాస్ పవర్ మరియు ఆదిత్య ధర్ టేకింగ్ ఈ చిత్రాన్ని మరో లెవల్‌కు తీసుకెళ్లాయని చెప్పాలి.

# బన్నీ 'రాకా' పెద్ద స్కెచ్చే.. కానీ 'శక్తి' పోట్లు?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబోలో రాబోతున్న ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ నుంచే అంచనాలు ఆకాశాన్ని తాకాయి కానీ తాజాగా విడుదలైన టైటిల్ పోస్టర్ 'రాకా', అందులో బన్నీ ఊహించని డీగ్లామరైజ్డ్ లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక రేంజ్ చర్చకు దారితీసింది. స్టైలిష్ స్టార్‌గా పిలవబడే అల్లు అర్జున్‌ను అట్లీ Rawగా, మురికి పట్టిన దుస్తులు, గుండు, చెదిరిన జుట్టుతో చూపించడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. ఈ డీగ్లామరైజ్డ్ అవతార్‌పై కొందరు "అట్లీ ఏదో మ్యాజిక్ చేయబోతున్నాడు" అని ప్రశంసిస్తుంటే, మరికొందరు మాత్రం బన్నీని ఇలా చూడలేకపోతున్నామంటూ మిశ్రమంగా స్పందిస్తున్నారు.

అయితే 'రాకా' అనే పేరు వినగానే నెటిజన్లు జూనియర్ ఎన్టీఆర్ కెరీర్‌లో భారీ డిజాస్టర్‌గా నిలిచిన 'శక్తి' సినిమాను గుర్తు చేసుకుంటున్నారు. అందులో విలన్ పేరు 'రాకా' కావడంతో, యాంటీ ఫ్యాన్స్ ఆ పాత ఫ్లాప్ రిఫరెన్స్‌లను బయటకు తీసి ట్రోల్ చేయడం ప్రారంభించారు ఈ దెబ్బకు సోషల్ మీడియాలో 'శక్తి', 'మెహర్ రమేష్' వంటి హ్యాష్ ట్యాగ్‌లు మళ్లీ ట్రెండింగ్‌లోకి వచ్చాయి. అయితే తమ హీరో లుక్‌ను, టైటిల్‌ను కావాలనే టార్గెట్ చేస్తున్నారంటూ అల్లు అర్జున్ అభిమానులు గట్టిగానే కౌంటర్లు ఇస్తున్నారు. "అక్కడ ఉన్నది అట్లీ.. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య" అని బన్నీ ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పటి విలన్ పేరు పెట్టినంత మాత్రాన సినిమా రిజల్ట్ మారిపోదని, ఇది సరికొత్త రికార్డులు సృష్టిస్తుందని వారు వాదిస్తున్నారు. అయితే ఈ 'రాకా' ట్రోలింగ్ బన్నీ సినిమాకు నెగటివ్ అవుతుందా లేక పబ్లిసిటీగా మారుతుందా అనేది కాలమే నిర్ణయించాలి!



# చిరు నిర్మాతతో నార్నె నితిన్ కొత్త ప్రాజెక్ట్

జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్ వరుసగా 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్', 'ఆయ్' చిత్రాలతో విజయాలను అందుకుని మంచి గుర్తింపును సంపాదించారు. ఈయన కెరీర్ లో 'శ్రీశ్రీశ్రీ రాజావారు' చిత్రం మొదటగా ప్రారంభం అయింది. కానీ ఈ చిత్రం చాలా ఆలస్యంగా విడుదలై అపజయాన్ని అందుకుంది. ఇదిలా ఉండగా, ఈ యువ హీరో తన తదుపరి చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలో చేయబోతున్నట్లు సమాచారం. తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమల్లో వరుసగా సినిమాలు నిర్మిస్తున్న కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో నార్నె నితిన్ తన తదుపరి ప్రాజెక్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు దాదాపు పూర్తయ్యాయని, మరికొద్ది రోజుల్లో దర్శకుడు సహా ఇతర వివరాలతో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఈ నిర్మాణ సంస్థ ఇటీవల తమిళ స్టార్ హీరో విజయ్ ప్రధాన పాత్రలో రూపొందిన 'జన నాయగన్' చిత్రాన్ని నిర్మించింది. అయితే ఈ సినిమా విడుదల విషయంలో పలు సవాళ్లు ఎదుర్కొంటుంది. ఇక ఇదే నిర్మాణ సంస్థ మెగాస్టార్ చిరంజీవితో కూడా ఓ భారీ చిత్రాన్ని రూపొందించేందుకు సిద్ధమవుతోంది. బాబీ కొల్లి దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం ప్రారంభ కార్యక్రమం మరికొద్ది రోజుల్లో జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరవనున్నట్లు సమాచారం.



# బ్లాక్‌బస్టర్‌కు నీకంటే ఎవరూ అర్హులు కారు

కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో 'డెకాయిట్' సందడి కనిపిస్తోంది. అడివి శేష్ హీరోగా షానియల్ డియో తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు అందరూ ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. తాజాగా నటి సమంత టీమ్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్ర నిర్మాత సుప్రియను ఉద్దేశించి ఇన్‌స్టాలో స్టోరీ పెట్టారు.

''సుప్రియ.. 'డెకాయిట్' కోసం నువ్వు పడిన కష్టం, నీ పట్టుదల, సినిమాపై నీకున్న అంకితభావం అన్నీ నేను స్వయంగా చూశాను. బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడానికి నీకంటే ఎవరూ అర్హులు కారు. దేవుడి ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉండాలి'' అని సమంత అన్నారు. 'డెకాయిట్' విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్‌కు ముందుగానే శుభాకాంక్షలు తెలిపారు. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. శేష్ సరసన మృణాల్ నటించగా.. బాలీవుడ్ నటుడు, దర్శకుడు అనురాగ్ కశ్యప్ విలన్‌గా కనిపించనున్నారు. విడుదల తేదీ ప్రకటించిన నాటినుంచి చిత్రబృందం జోరుగా ప్రచారం చేసి సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్, ట్రైలర్ ఆకట్టుకునేలా ఉండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.



# దసరా రిలీజ్ కోసం స్పీడ్ పెంచిన 'ఫౌజీ' టీమ్

రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం 'ఫౌజీ' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమై ఇప్పటికే చాలా కాలం గడిచింది. ప్రభాస్ ఈ చిత్రంతో పాటు ఇతర ప్రాజెక్టుల షూటింగ్స్‌లో కూడా పాల్గొనడం వల్ల ఈ సినిమా చిత్రీకరణ కొంత నెమ్మదిగానే సాగింది. మొదటి నుంచే ఈ చిత్రాన్ని ఈ ఏడాది దసరా సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగానే ప్రస్తుతం షూటింగ్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి.

దసరా సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో మూవీ టీమ్ షూటింగ్ స్పీడ్‌ను మరింత పెంచినట్లు సమాచారం. దసరా రిలీజ్‌ను లక్ష్యంగా పెట్టుకుని దర్శకుడు హను రాఘవపూడి మెయిన్ కాస్ట్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, సెకండ్ యూనిట్ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. ఇలా రెండు యూనిట్లుగా షూటింగ్ నిర్వహిస్తూ చిత్రీకరణను త్వరితగతిన పూర్తి చేసే దిశగా మూవీ బృందం పనిచేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

